# అబ్బాయి పెళ్లి

"మా అబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది" ఆఫీసు కొలీగ్స్‌కి స్వీట్సు ఇస్తూ చెప్పాను. అంతా అభినందనల్తో ముంచెత్తారు.

పుత్రోత్సాహం నన్ను నేలమీద నిలబడనివ్వటంలేదు.

"ఇక రేపట్నుంచి ఆడపిల్లల తల్లిదండ్రులు మన రామారావింటి ముందు క్యూ కడతారు"

మా ఆఫీసరు మాటలకి వంతపాడారంతా. పది లకారాలదాకా కట్నం వచ్చితీరుతుందని ఏకగ్రీవంగా తీర్మానించేశారు కూడా.

నా భుజాలు మూడంగుళాలు పెరిగినమాట యథార్థమే.

ఇంటికెళ్తూనే కొలీగ్స్ మాటల్ని తు.చ. తప్పకుండా రమకి చెప్పాను. పొంగిపోయింది. అవన్నీ తిరిగి కొడుక్కి చెప్పింది.

"భూదేవంత అరుగు మీద ఆకాశమంత పందిరివేసి నీ పెళ్ళి జరిపిస్తాంరా. కుందనపుబొమ్మలాంటి కోడలు లక్షల్తో లక్ష్మీదేవిలా ఇంట్లో అడుగుపెడుతుంది చూడు" అంటూ వాడి బుగ్గలు పుణికింది.

"అప్పుడే నాకు పెళ్ళెందుకు మమ్మీ. రెండేళ్ళు ఫ్రీబర్డ్‌గా ఉండనీ" అన్నాడు వరుణ్ ముసిముసిగా నవ్వుతూనే.

"మాకు మా సరదాలుండవేమిట్రా. రంగరంగ వైభోగంగా నీ పెళ్ళి చెయ్యాలి. మేం మనవల ఆటపాటల్తో మురిసిపోవాలి....."

"స్టాప్. స్టాప్. మీకెలా బావుంటే అలా చెయ్యండి. సాయంత్రమే ప్రయాణం కదా, ఫ్రెండ్స్‌ని కలిసొస్తాను" అంటూ వెళ్ళాడు.

వరుణ్ హుందాగా నడుస్తూ బయటికెళ్తుంటే "మనబ్బాయి బంగారమండీ. కోటికొక్కరుంటారనుకోండి" అంది రమ.

"నా కొడుకోయ్" కాలరెగరేసి అన్నాను. "వీడికి తగ్గ కోడలొస్తుంది చూడు"

"మీరసలే బోళాబోళీ మనిషి. ఇట్టే బుట్టలో పడిపోతారు. ఎవరైనా సంబంధం తెస్తే తొందరపడి తలూపొద్దు. లౌక్యంగా వ్యవహరించి ఎక్కువ కట్నం రాబట్టాలి"

"ఎక్కువే వస్తుందే. ఒక్కడే కొడుకు. యాభై లక్షలపైన ఆస్తి ఉంది. బ్యాంకు ఉద్యోగం. ఇంతకంటే ఏమిటే. వీడ్ని చేసుకునే అమ్మాయి బంగారుపూలతో పూజ చేసి ఉంటుంది!"

"బంగారమంటే గుర్తొచ్చింది. నాకు మా నాన్న పదికాసుల బంగారం పెట్టాడని పదికీ పదిహేనుకీ ఒప్పుకుంటే కాదు. పాతిక కాసులకి తగ్గకుండా బంగారం పెట్టమందాం"

"చూస్తుంటే అత్తగారి కట్నం కూడా అడిగేట్టున్నావే" నవ్వేను.

"మీరేం వేళాకోళమాడక్కర్లేదు. కట్నంలో పది పర్సంటు ఆడబడుచు కట్నం, ఇంకో పది పర్సంటు అత్తగారి కట్నం ఇచ్చి తీరాల్సిందే"

"ఆడబడుచుల్లేరంటారేమో?!"

"అన్నదమ్ముల పిల్లలున్నారని చెప్పి తీసేసుకుందాం. ఆ డబ్బుతో చంద్రహారం కొని, కోడలికి గొప్పగా పెట్టేద్దాం"

"ఈ ఐడియా బావుందేవ్"

"అమ్మాయి కూడా ఇలియానాలా సన్నగా మెరుపుతీగలా ఉండాలి. మీరు తొందరపడకుండా అలా నిలబడితే చాలు, నేను ముగ్గులు పెట్టేస్తా"

"అలాగేనే. నీ శక్తియుక్తులు నాకు తెలీనివా ఏమిటి. బంధుమిత్రులందరికీ చెప్పేద్దాం. నలుగురికీ తెలిస్తే డిమాండ్ పెరుగుతుంది !"

"ఆలస్యం అమృతం విషం అన్నారు. ఇప్పుడే చెప్పెయ్యండి. జీతం పన్నెండువేల అయిదొందలని కూడా చెప్పండి. కుళ్ళిపోతే కుళ్ళిపోనివ్వండి"

వెంటనే ఫోన్ అందుకున్నాను. వరుణ్‌కి బ్యాంకులో ఉద్యోగం వచ్చిందనీ మర్నాడే హైదరాబాద్ వెళ్ళి జాయినవుతున్నాడనీ చెప్పాను. అంతా సంబరపడ్డారు. ఒకరిద్దరు మాత్రం "ఏమాత్రంలో ఉన్నారేవిటీ" అంటూ ఆరా తీశారు.

"మా ఆస్తిపాస్తులు మీకు తెలుసుగా" అని దాటవేశాను.

వరుణ్ రెండోనెల జీతం కూడా తీసేసుకున్నాడు.

ఒక్కటంటే ఒక్క సంబంధం రాలేదు. కనీసం ఎంక్వయిరీ కూడా లేదు.

"పదిమందికీ మనబ్బాయి పెళ్ళికున్నాడన్న సంగతి తెలీలేదంటావా ఏమిటీ"

ఇక ఉండబట్టలేక కడుపులోని ఆందోళనని కక్కేశాను.

"చుట్టాలందరికీ ఫోన్లు చేసి మరీ చెప్పేంగా!"

"మరి ఆడపిల్లల పేరెంట్సంతా ఏమైపోయారంటావు?!"

"ఏమీ అవ్వరు. ఎక్కడికీ పోరు. వరుసగా వచ్చేస్తారు......ఎందుకైనా మంచిది రేపోసారి పెళ్ళిళ్ళ పేరయ్యని కలవండి"

"మగపెళ్ళివాళ్ళం మనం వెళ్తే బావుండదేమోనే.....!"

"మనం వెళ్ళామని తెలుస్తుందా ఏమిటీ. అయినా పెళ్ళిళ్ళ పేరయ్యని ముందే హెచ్చరిద్దాంలెండి"

మర్నాడు వాకబుచేసి ఓ పెళ్ళిళ్ళ పేరయ్యని కలిశాను.

"శీఘ్రంగా నా దగ్గరకి రావటం మంచిదైంది. ఒకటీ రెండూ కాదు....ఫస్టాసైన సంబంధాలు నా జేబులో యాభై ఉన్నాయి. మన చైర్మన్‌గారి మనవరాలికీ ఎమ్మెల్యేగారి అన్న కొడుక్కీ బ్యాంక్ మేనేజర్‌గారి చెల్లెలికీ నేనేకదా ఫస్టాసైన సంబంధాలు కుదిర్చిందీ. మీ అబ్బాయి వివరాలు రెండు ఫోటోల్తోబాటు ఇవ్వండి. గోత్రం, నక్షత్రం, పుట్టిన సమయం, పుట్టిన ఊరు....అన్నీ వివరంగా రాయండి. రేపటికల్లా అమ్మాయిల ఫోటోల్తో మీ ఇంట్లో వాలిపోతాను. మీకెలాటివి కావాలిస్తే అక్షరాలా అలాటి సంబంధం రెండ్రోజుల్లో తెచ్చి కుదిర్చేస్తాను"

ఆయన వాక్ప్రవాహానికి అడ్డువేస్తూ అన్నాను– "ముందు అమ్మాయిల ఫోటోలు తీసుకురండి. నచ్చితే మా అబ్బాయి ఫోటో ఇస్తాను" మగపెళ్ళివారి బింకం ప్రదర్శించాను.

"అబ్బే. అలా కుదరదు. అబ్బాయిల ఫోటోల్లేకపోతే ఆ సంబంధం వంకెవరూ కన్నెత్తి చూట్టంలేదు. కన్ను వంకరో కాలు వంకరో అని అనుమానిస్తున్నారు"

"ఛ. ఛ....మావాడు హీరోలా ఉంటాడు"

"నిజమే. కానీ ఆ సంగతి వాళ్ళకి తెలియాలి కదా. తెలియాలంటే ఫోటో చూపించాలి కదా!"

తలూపి, "రేపు తెచ్చిస్తాన్లెండి" అన్నాను ముఖాన గంటు పెట్టుకుని.

"వెయ్యి రూపాయలు కూడా తీసుకురండి. నా పుస్తకంలోకి పేరెక్కితే చాలు వెయ్యి ఇవ్వాల్సిందే. పెళ్ళి కుదిరాక మీ సంతోషంకొద్దీ నాలుగువేలో అయిదువేలో దక్షిణ ఇద్దురుగాని. నాలుక్కీ అయిదుకీ చూడకండి. లక్షలు.....లక్షలు తెచ్చే లక్షణమైన పిల్లని

చూస్తాగా!"

మారు మాట్లాడలేకపోయాను.

మావాడి బయోడేటా ఆయనకిచ్చి వారం రోజులయ్యింది.

ఆదివారం ఉదయం టిఫిన్ చేస్తూ, "పెళ్ళిళ్ళ పేరయ్య అయిపులేదేవిటీ" అనుకుంటుంటే ఊడిపడ్డాడు.

నాలుగు ఇడ్లీలు పెట్టిచ్చింది రమ. అడిగి మరీ నెయ్యి వడ్డించుకుని తిన్నాడు.

కాఫీ తాగాక భుజాన తగిలించుకున్న సంచిలోంచి కట్టలు బయటికి తీశాడు.

అవన్నీ అమ్మాయిల బయోడేటా ఫారాలూ ఫోటోలూనూ.

నేనూ రమా చెరోపక్కనుంచి దాడిచేశాం.

ఎక్కువగా వరుణ్‌కన్నా పెద్ద వయస్సు అమ్మాయిలే ఉన్నారు. అయినప్పటికీ అన్ని విధాలా బాగున్నవి నాలుగు ఏరి, వారి స్థితిగతుల గురించి చెప్పమన్నాం. మా ఉద్దేశం కట్నం ఎంతిస్తారో చెప్పమనే.

కట్నం అయిదారు లక్షల మధ్య ఉన్నారని చెప్పేసరికి నీరుగారి పోయాం.

ఇంతలో మరో కట్టలో ఉన్న ఒక ఫోటో బయటికి లాగింది రమ. అమ్మాయి సినీతారలా ఉంది.

మేం అడక్కుండానే దండకం అందుకున్నాడు.

"అమ్మాయి ఎంసీఏ. స్వస్థలం రాజమండ్రి. తండ్రి సుబ్బారాయుడనీ.. పెద్ద సివిల్ కాంట్రాక్టరు. రెండు మేడలున్నాయి. ఒకమ్మాయీ ఒకబ్బాయీనూ. అమ్మాయికి ఒక మేడ ఇచ్చి ఇరవై లక్షలుదాకా ఇస్తారు..."

"ఇది మాకు బాగా నచ్చింది. కనుక్కోండి..."

పెదవి విరిచాడాయన.

"లాభం లేదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలంది అమ్మాయి"

"ఇంకెక్కడి సాఫ్ట్‌వేరు.. ఉద్యోగాలు ఊడిపోతున్నాయిగా! బ్యాంకు ఉద్యోగమే మంచిది. మీరెలాగైనా నచ్చజెప్పి కుదర్చండి. మీ కష్టం ఉంచుకోం" అంటూ నా చెయ్యిగిల్లింది రమ.

"మీరు ప్రయత్నిస్తే అవుతుంది. మీ ప్రతిభ గురించి చాలా విన్నానండి. పదివేలదాకా మీకు ముట్టజెబుతాను....." ముసుగులో గుద్దులాట ఎందుకని సూటిగా

చెప్పేశాను.

క్షణం ఆలోచించి అన్నాడు– "ఒక్కడే కొడుకు. బ్యాంకు ఉద్యోగం. యాభైలక్షల ఆస్తి.......ఒప్పించేస్తాన్లెండి. ఇంతకంటే ఫస్టాసైన సంబంధం ఎక్కడ దొరుకుద్దీ. ఇప్పుడే ఇట్నించిటే వెళ్ళి రాజమండ్రి బస్సెక్కేస్తాను. దారి ఖర్చులకో అయిదొందలు కొట్టండి...."

"ఏకంగా ఒక్కసారే ఇద్దాంలెండి"

"అమ్మమ్మ.... దేని దారి దానిదే. ఒకదాన్తో ఇంకోటి ముడిపెట్టకూడదు"

రమ వంక చూశాను. ఇబ్బందిగా చూసింది. ముఖం మాడ్చుకుని డబ్బిచ్చాను.

"ఈ సంబంధం కుదిరిపోయినట్టే. నిశ్చింతగా ఉండండి. మాఘంలో కానిచ్చేస్తామని చెబుతాను. అభ్యంతరం లేదు కదా?"

"అహహ.....అదేంలేదు. పెళ్ళి రేపే అన్నా సరే, మేం రెడీ"

"ఇలా వెళ్ళి అలా వస్తాను శుభవార్తతో"

ఆయనలా వెళ్ళాడో లేదో అంతదాకా ఉగ్గబెట్టుకున్న ఆనందం బయటికి తన్నుకొచ్చింది

"భలే సంబంధంలే. వరుణ్ అదృష్టవంతుడు" సంబరపడి పోయాం. పెళ్ళిపనులు ముచ్చటించుకుంటూ ఊహల్లో ఊరేగాం.

క్షణాలు లెక్కపెడుతూ ఎదురు చూస్తుంటే రోజులు గడిచిపోయాయిగానీ పేరయ్య పత్తాలేదు.

టెన్షన్ భరించలేక ఫోన్ చేశాను.

"అది మీకు లాభంలేదులెండి. ఫస్టాసైనవి ఇంకో రెండున్నాయి. రెండు మూడ్రోజుల్లో మీతో డైరెక్టుగా మాట్లాడించేస్తాను"

డీలా పడ్డాం.

"ఆ తలమాసిన పేరయ్య మీకెక్కడ దొరకాడండీ. మాయమాటలు చెప్పి ఒకటా రెండా పదిహేనువందలు దండుకున్నాడు"

నాల్రోజుల వరకూ అతణ్ణి కొత్త కొత్త తిట్లతో తిడితేగానీ మా ఉక్రోషం చల్లారలేదు.

"ఇదివరకు పెళ్ళికెదిగిన అబ్బాయి ఉన్నాడంటే చాలు బోలెడు సంబంధాలొచ్చిపడేవి. ఇప్పుడేమయిందో ఏమిటో! అమ్మాయిలు బాగా చదువుకుంటే

మాత్రం ఉద్యోగాలు చేస్తుంటే మాత్రం మరీ ఇంతగా కాలం మారిపోయిందా!" అపనమ్మకం కొరికేస్తుంటే నిరుత్సాహంగా అన్నాను.

"అదేమీకాదుకానీ ఎవరైనా లేనిపోనివి కల్పించి చెప్పి మనకి సంబంధాలు రానీకుండా అడ్డుపడుతున్నారేమోనని నా అనుమానం"

ఆ కోణం నుంచి జంటగా ఆలోచించాంగానీ అనుమానాస్పద వ్యక్తులూ అంశాలూ కన్పించలేదు.

"పోనీ అబ్బాయి జాతకం ఎవరికైనా చూపిద్దామంటారా ?" మెల్లగా అంది.

"అవసరం లేదే. వాడు మహర్జాతకుడు" అనేశానుగాని మనస్సు మారుమూలల్లో ఏదో పీకసాగింది!

మా కుటుంబ మిత్రుడు ఓ సంబంధం తీసుకొచ్చాడు.

'హమ్మయ్య' అనుకున్నామో లేదో "అమ్మాయి చాలా బావుంటుంది. మచ్చలేని కుటుంబం. కానీ కట్నం రెండు లక్షలు మించి ఇవ్వలేరు" అన్నాడు.

అతడి మాటలు పూర్తికాకుండా రయ్‌మని లేచింది రమ.

"ఈరోజుల్లో ఆ మాత్రం కట్నం ముష్టివాళ్ళ పిల్లలకి ఇస్తున్నారు. మాకంత ఖర్మ పట్టలేదు. రాజాలాంటి సంబంధమే చేస్తాం"

ముఖం ముడుచుకెళ్ళిపోయాడు.

"మరీ మొహంమీదే అనేశావేంటే" నొచ్చుకున్నాను.

"ఆ ముక్క చెవినబడేసరికి ఒళ్ళు మండిపోయింది. అయినా అదీ ఓ సంబంధమే! మన ఆస్తీ అంతస్తూ అబ్బాయి ఉద్యోగం చూసుకోవద్దూ. తగుదునమ్మా అంటూ లింగూ లిటుకూ సంబంధాన్ని తీసుకొచ్చెయ్యడమే !"

రమ మాటల్లో సత్యం ఉంది. మరి తర్కించలేదు.

'క్విక్ మ్యారేజెస్' సంస్థ ద్వారా తన కూతురి పెళ్ళి నిశ్చయమైందని చెప్పాడు కొలీగ్ చక్రధర్. వివరాలు కనుక్కున్నాను.

ఓ ఆదివారం 'క్విక్ మ్యారేజెస్' వారి ఆఫీసుకెళ్ళాం.

అఫ్స్ చాలా బావుంది. కార్పొరేట్ ఆఫీసులా ఉంది. వధూవరుల తల్లిదండ్రులంతా ఆల్బంలు తిరగేస్తున్నారు. మరి కొందరు కంప్యూటర్లలో వధూవరుల వివరాలు పరిశీలిస్తున్నారు.

"ముందే ఇక్కడికి రావాల్సిందే. చాలా తప్పు చేశాం. మనవాడి పెళ్ళి ఇవాళే కుదిరినా కుదరొచ్చు చూడు......." అక్కడి వాతావరణం చూసి అన్నాను.

సంబంధిత ఇన్‌చార్జి మేడం దగ్గరికెళ్ళాం.

"క్విక్ మ్యారేజెస్ మీకు వెల్కం చెబుతోంది. క్విగ్గా అన్నీ చెయ్యడం మా స్పెషాలిటీ. అబ్బాయి కోసం వచ్చారా అమ్మాయికోసం వచ్చారా?" రివాల్వింగ్ చెయిర్లో తిరుగుతూ అడిగిందావిడ.

"మా అబ్బాయి కోసం అమ్మాయి...."

"అమ్మాయా? చాలా ప్రాబ్లం. అమ్మాయిల్లేరసలు. మా దగ్గర టూ థౌజండ్ మేచెస్ ఉన్నాయి. అందులో బ్రైడ్స్‌వి సిక్స్‌హండ్రెడ్డే. అయినా క్విక్ మ్యారేజెస్ కొచ్చారుగా. నో వర్రీ. క్విగ్గా చూసేస్తాం. ఫీజు త్రీ థౌజండ్. కమీషన్ టూ పర్సెంట్....."

ఉలిక్కిపడి ముఖాముఖాలు చూసుకున్నాం.

"డౌరీ మీద టూ పర్సంట్ అన్నమాట. రాష్ట్రంలోనేకాదు, ఇండియాలో ఫారెన్లో కూడా గాలించి ఇప్పటికిప్పుడు థర్టీ ఫార్టీ మేచెస్ చూపించేస్తాం. అంతా క్విక్......నో వెయిటింగ్. మీ డేటా, అబ్బాయి జాతకచక్రం, హెచ్చైవీ, హెపటైటిస్-బి టెస్టు రిపోర్టులూ ఇవ్వండి"

"అవెందుకండీ" కీచు గొంతుతో అన్నాను.

"అబ్బాయి మంచివాడనీ మంచి భవిష్యత్తు ఇవ్వగలవాడనీ గ్యారంటీ ఇవ్వొద్దూ?!"

మారుమాట్లాడకుండా డబ్బుకట్టి వివరాలిచ్చాం.

మమ్మల్నో గదిలోకి తీసుకెళ్ళి కంప్యూటర్ ముందు కూర్చోబెట్టారు.

"వధువు వయసు, ఎత్తు, చదువు రేంజ్ ఏమిటి?"

ఆ వివరాలు చెప్పి, "కట్నం బాగా వచ్చేది చూడండి" అన్నాను.

"ష్.....కట్నం నిషేధం. పబ్లిగ్గా మాట్లాడకూడదు. ప్రోపర్టీ వివరాలు చూపిస్తాను. దాన్నిబట్టి డిసైడ్ చేసుకోండి"

క్షణాల్లో యాభై సంబంధాల వివరాలు ఫోటోల్తోసహా స్క్రీన్ మీద ప్రత్యక్షమయ్యాయి.

అన్నివిధాలా బావున్నవి ఓ పది సెలక్టు చేశాం.

"మీరు ఇంట్రెస్టు చూపిస్తున్నారని వారికి తెలియజేస్తాం. వారిని మీ బయోడేటా

చూడమంటాం. వారి నుంచి రెస్పాన్స్ రాగానే మీకు తెలియజేస్తాం. ఈలోగా మేడం చెప్పిన సర్టిఫికెట్లు తెచ్చివ్వండి"

బయటికొచ్చాం.

"అందరికన్నా విజయవాడ అమ్మాయి ఫస్టు. భీమవరం అమ్మాయి సెకండు. హైదరాబాదుది బాగానే ఉన్నా వద్దులెండి. అక్కడి అమ్మాయిలు మరీ ఫాస్ట్‌గా ఉంటారు" రమ ఉత్సాహంగా చెప్పుకుపోతోంది.

వారంవారం 'క్విక్ మ్యారేజెస్' కి వెళ్తున్నాం. రెస్పాన్స్ తెలుసుకుంటూ కొత్త సంబంధాలు తిరగేస్తున్నాం.

రెస్పాన్స్ పెద్దగా లేదు. అధైర్యపడకుండా దగ్గరుండి మరీ ఫోన్లు చేయించాం.

అబ్బాయి వివరాలు ఇంకా చూళ్ళేదన్నారొకరు. అబ్బాయి హైటు అమ్మాయికన్నా రెండంగుళాలే ఎక్కువ గనుక 'సారీ' అన్నారింకొకరు. ఒక్కడే అబ్బాయి గనుక పేరెంట్స్ బాధ్యతంతా అతడిమీదే ఉంటుందన్నారింకొకరు. ముగ్గుర్నుంచి జవాబే రాలేదు. పోనీ యావరేజ్‌గా ఉన్న హైదరాబాద్ సంబంధమైనా ఓకే అయితే బావుణ్ణని ఆశగా అడిగాం.

అమ్మాయిని చూడ్డానికి హైదరాబాద్ రమ్మన్నారు. మిగతా విషయాలు ముఖాముఖీ మాట్లాడుకుందామన్నారు.

ప్రోపర్టీ వివరాలు చూసి లెక్కలేసుకున్నాం. ఏడెనిమిది లక్షల వరకూ రావచ్చనిపించింది.

'ఉన్నంతలో ఫరవాలేదులే' సర్దిచెప్పుకుని హైదరాబాదు వెళ్ళాం.

ముగ్గురం వెళ్ళకూడదని సిటీలో ఉంటున్న ఓ ఫ్రెండుని కూడా తీసుకువెళ్ళాం. మామూలుగా పెళ్ళిచూపులకు చేసే హడావిడేం చెయ్యలేదు. ఇంటికి బంధువులొస్తే ఆహ్వానించినట్టు ఆహ్వానించారు.

బజారుకెళ్తున్నట్టుగా తయారై వచ్చి మాకెదురుగా కూర్చుంది అమ్మాయి. ఓ మోస్తరుగా ఉంది.

లోపలికెళ్ళి మాట్లాడుకోమన్నారు. అక్కర్లేదన్నాడు మా అబ్బాయి.

"మా అమ్మాయి మాట్లాడుతుందిట....."

మా మొహాలు పాలిపోయాయి. అబ్బాయి ఖిన్నుడై లోపలికెళ్ళాడు. పది నిమిషాలయ్యాక వచ్చారు. "నాకు ఓకే మమ్మీ" అన్నాడు రమతో.

"వెళ్తాం" అని బయటికొచ్చాం.

అమ్మాయి తండ్రి మా వెనకే వచ్చాడు. వెంటనే సంబంధం 'ఓకే' అని చెప్పేస్తే బాగుండదని మెల్లగా అన్నాను "ఇంటికెళ్ళాక ఉత్తరం.....కాదులెండి ఫోన్ చేస్తాం"

"అవసరం లేదు. మీ అబ్బాయి మా అమ్మాయికి నచ్చలేదు"

"ఏం?"

"మీ అబ్బాయివి కుతుకు మెడలు అని......"

(స్తాన్నపడ్డాం.

మా గుండెల మీదకి కుంపటి ఎక్కింది!

**(ఈనాడు ఆదివారం అనుబంధం 30.8.2009 )**
**(కన్నడంలోకి అనువదింపబడింది)**